సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 22 । జులై । 2025



నవోదయం ఏదీ..?

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు ఈసారి దరఖాస్తులు గణనీయంగా తగ్గాయి.

10లో



'మా ఆకలి కేకలు పట్టవా?'

సుపరిపాలనకు తొలి అడుగు అంటున్న సీఎం, డిప్యూటీ సీఎంకు తమ ఆకలి కేకలు పట్టవా అని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కడలిలోకి 64 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 64,663 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

కక్ష సాధింపులో భాగమే మిథున్‌రెడ్డి అరెస్టు



హబీబుల్లా ఖాన్

రాజమహేంద్రవరం సిటీ: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేశారని, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబుల్లా ఖాన్ ఆరోపించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతోనే లేని లిక్కర్ కేసును సృష్టించి, అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. కూటమి పాలనలో కక్షసాధింపులు తారస్థాయికి చేరాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూండటంతో వైఎస్సార్ సీపీలోని కీలక నేతలపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామన్నందుకే ప్రజలు కూటమికి ఓట్లేశారని, కానీ నేడు వారి ఆశలు అడియాసలయ్యాయని అన్నారు. కూటమి సర్కారు ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని దుయ్యబట్టారు.

పీజీఆర్‌ఎస్‌కు 234 అర్జీలు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ప్రజలు 234 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి తదితరులు అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ 101, పంచాయతీరాజ్ 39, పోలీస్ 22, విద్యుత్ 12, ఇతర శాఖలకు చెందినవి 58 చొప్పున అర్జీలు వచ్చాయి.

పోలీస్ పీజీఆర్‌ఎస్‌కు 27 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం(పీజీఆర్‌ఎస్)కు 27 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఏఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు స్వయంగా మాట్లాడి, అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

23న ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు దీనికి హాజరు కావాలని సూచించారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత ఇచ్చిన ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వివరించారు.

27న జిల్లా స్థాయి యోగా పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యాన ఈ నెల 27న జిల్లా స్థాయి యోగాసన పోటీలు స్థానిక గౌతమ ఘాట్‌లోని శ్రీ జగద్గురు పీఠం(వరల్డ్ టీచర్స్ ట్రస్ట్)లో నిర్వహించనున్నారు. యోగా గురువు శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 10 నుంచి 14 సంవత్సరాల బాలబాలికలకు సబ్ జూనియర్, 14 నుంచి 18 సంవత్సరాల వారికి జూనియర్, 18 నుంచి 28 సంవత్సరాల వారికి సీనియర్, 28 నుంచి 35 సంవత్సరాల వారికి సీనియర్-ఎ, 35 నుంచి 45 సంవత్సరాల వారికి సీనియర్-బి, 45 నుంచి 55 సంవత్సరాల వారికి సీనియర్-సి కేటగిరీల్లో 10 ఈవెంట్లలో ఈ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 7396 00 3444 నంబరులో సంప్రదించాలన్నారు.

జక్కంపూడికి అనపర్తి మాజీ ఎమ్మెల్యే సంఘీభావం



జక్కంపూడి రాజాకు సంఘీభావం తెలుపుతున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వారం రోజులుగా పోరాడుతున్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు అనపర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సంఘీభావం తెలిపారు. రాజాను సోమవారం రాజమహేంద్రవరంలో ఆయన కలిశారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాజా.. కార్మికుల సమస్యలపై చేస్తున్న పోరాటానికి తామెప్పుడూ తోడుగా ఉంటామని చెప్పారు.

స్మార్ట్‌గా.. సర్కారువారి దెబ్బ!





మీటర్ రీడింగ్ తీస్తున్న ఉద్యోగి

- స్మార్ట్ విద్యుత్ మీటర్లకు సర్కారు గ్రీన్ సిగ్నల్
- ఇకపై బిల్లు తీసే ప్రక్రియకు మంగళం
- ఉమ్మడి జిల్లాలో 500 మందికి పైగా మీటర్ రీడర్ల ఉపాధికి గండి

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యుత్ శాఖలో స్మార్ట్ మీటర్లు కలకలం రేపుతున్నాయి. వీటిని తమ నెత్తిన బలవంతంగా పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో విద్యుత్ వినియోగదారుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు విద్యుత్ వినియోగం నమోదు చేసే మీటర్ రీడర్లకు సైతం ఈ 'స్మార్ట్' షాక్ తగులుతోంది. దశల వారీగా అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు విద్యుత్ శాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటికే 10 వేలకు పైగా స్మార్ట్ మీటర్లు బిగించారు. ఒక్క నవ్య తూర్పు గోదావరి జిల్లాలోనే 6 వేలకు పైగా బిగించారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ పూర్తయితే మొబైల్ ఫోన్ల మాదిరిగానే విద్యుత్‌కు కూడా రీచార్జ్ పాలసీ అమలులోకి వస్తుంది. అంటే, కరెంటు కావాలంటే ముందుగానే డబ్బులు చెల్లించాలన్న (ప్రీపెయిడ్) మాట. ఇది వినియోగదారులకు ఇబ్బందికరంగా మారనుండగా.. మరోవైపు ఉపాధి కోల్పోయి మీటర్ రీడర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తలెత్తనుంది.

తొలి దశలో 5 లక్షల మీటర్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గృహ విద్యుత్ కనెక్షన్లు సుమారు 16.70 లక్షలున్నాయి. అలాగే, వాణిజ్యం 1,93,613, వ్యవసాయం 63,751, పారిశ్రామికం 6,314, హెచ్‌టీ 11 కేవీ 1,292 చొప్పున కనెక్షన్లు ఉన్నాయి. తొలి దశలో సుమారు 5 లక్షల మీటర్లు బిగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. నవ్య తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 6.70 లక్షల విద్యుత్ సర్వీసులుండగా.. తొలి విడతగా 2 లక్షల వరకూ స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రక్రియకు నాంది పలికారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలకు వీటిని బిగిస్తున్నారు.

రోడ్డున పడనున్న మీటర్ రీడర్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 500 మందికి పైగా మీటర్ రీడర్లు ఉన్నారు. వీరిలో అత్యధికులు పదేళ్లకు పైగా అనుభవం ఉన్న వారే. ప్రతి నెలా 1 నుంచి 11వ తేదీ లోపు వీరు మీటర్ రీడింగ్ తీస్తారు. ఒక మీటర్ రీడింగ్ తీసినందుకు గాను విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.6 నుంచి రూ.7 చెల్లిస్తుంది. రీడింగ్ యంత్రం చార్జీలు, ఫోన్ రీచార్జ్, పేపర్ రోల్, మరమ్మతులు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ మినహాయింపులు పోనూ ఒక్కో రీడర్‌కు చేతికి మీటర్‌కు రూ.3.10 మాత్రమే అందుతుంది. సగటున ఒక్కో రీడర్ నెలకు 3 వేల మీటర్ల వరకూ రీడింగ్ తీస్తారు. దీని ప్రకారం వారి ఆదాయం ప్రతి నెలా కేవలం రూ.10 వేలలోపే ఉంటుంది. ప్రాంతం, పట్టణాన్ని బట్టి రీడింగ్ సామర్థ్యం మారుతుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్)లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కొంతమంది సిబ్బందితో పాటు మీటర్ రీడర్లు కూడా ఉద్యోగాలు కోల్పోతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికితోడు విద్యుత్ రీచార్జ్‌పై అవగాహన లేకపోతే ఇబ్బందులు తప్పవు. ముందుగా రీచార్జి



చేయించుకోని వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీనివలన నేరుగా లైన్ల నుంచి విద్యుత్ అక్రమంగా వినియోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

పొట్టకూటి కోసం పోరుబాట

చాలీచాలని వేతనాలతో బతుకుబండి లాగుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు కూటమి ప్రభుత్వం షాక్ ఇవ్వడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోవడంతో ఉద్యమ బాట పట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ నిర్వహించారు. సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని గళమెత్తారు. 20 ఏళ్లుగా విద్యుత్ శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని నినదించారు. ఈ ఆందోళనకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది మంది తరలి వెళ్లారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు తీరుపై విమర్శలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన చంద్రబాబు నాయుడు.. ఇప్పుడు సీఎం అయిన తరువాత వాటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. వ్యవసాయ బోరు బావుల వద్ద స్మార్ట్ మీటర్లు పెడితే పగులగొట్టాలంటూ అప్పట్లో పిలుపునిచ్చిన చంద్రబాబు, నారా లోకేష్.. ప్రస్తుతం వీటిని వ్యవసాయ కనెక్షన్లకు అమర్చేందుకు సన్నాహాలు ప్రారంభించడంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉంటే ఒకలా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా వ్యవహరించడం తగదని హితవు పలుకుతున్నారు.

మీటర్ రీడర్ల డిమాండ్లివీ..

కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకువస్తున్నందున ఇప్పటికే కొనసాగుతున్న తమకు విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని మీటర్ రీడర్లు డిమాండ్ చేస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, విద్యార్హతను బట్టి రీడర్లకు విద్యుత్ శాఖలో టెక్నికల్, నాన్ టెక్నికల్ షిఫ్ట్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా.. మిగిలిన వారిని వాచ్‌మెన్, అటెండర్లుగా నియమించాలని కోరుతున్నారు. అలాగే, ఎస్క్రో ఖాతా వెంటనే తెరవాలని, కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులతో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



విద్యుత్ శాఖనే నమ్ముకుని ఇరవయ్యేళ్లుగా బతుకుబండి లాగుతున్న మీటర్ రీడర్ల ఉపాధికి గండి కొట్టడం తగదు. అసలు మొత్తం స్మార్ట్ మీటర్ల ప్రక్రియనే విరమించుకోవాలి. ఇది అనైతికం. ప్రజల వద్ద పెద్ద ఎత్తున బిల్లులు వసూలు చేసేందుకు అమలు చేస్తున్న కుట్ర. ఒకవేళ తప్పనిసరిగా అమలు చేస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి.

– తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

అమ్మవారి సన్నిధికి వెంకన్న సారె

- మందపల్లి పార్వతీదేవికి వాడపల్లి నుంచి ఆషాఢ సారె సమర్పణ
- దేవస్థాన ముఖద్వారంలో ఘన స్వాగతం
- శాకంబరిగా పార్వతీదేవి దర్శనం



మందపల్లిలో వాడపల్లి దేవస్థానం సారె తీసుకొస్తున్న అధికారులు, పండితులు

కొత్తపేట: శనిదోష నివారణకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మందపల్లిలోని ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి క్షేత్రంలో ఆషాఢ మాసం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. పార్వతీదేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, సారె, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, అర్చకులు, వేద పండితులు పార్వతీదేవి అమ్మవారితో పాటు, శనైశ్చర స్వామి, ఇదే క్షేత్రంలో వేంచేసిన బ్రహ్మేశ్వర, నాగేశ్వర స్వామివార్లను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషాలంకరణ చేశారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

కొనసాగుతున్న సంప్రదాయం

కొన్నేళ్లుగా వస్తున్న ఆషాఢ మాస సంప్రదాయం ప్రకారం కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి మందపల్లి పార్వతీదేవి అమ్మవారికి సారె పంపించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, వాడపల్లి దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ రాంబాబు, దేవస్థానం సిబ్బంది, పండితులు సారె తీసుకురాగా.. రావులపాలెం-అమలాపురం ప్రధాన రహదారిలో శనైశ్చరస్వామి దేవస్థాన ముఖద్వారం వద్ద ఈఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో భారీ ఊరేగింపుగా ఆలయానికి సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. మందపల్లి, ఏనుగుల మహల్, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రతిపక్షంపై కక్షపూరితంగా కేసులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణులు

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా కొవ్వూరులో కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లపూడి (కొవ్వూరు): వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మంత్రులు, ఎంపీలు, నాయకులపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తోందని, చట్టాలను పక్కన పెట్టి రౌడీ రాజ్యం చెలాయిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద సోమవారం రాత్రి పార్టీ శ్రేణులతో కలసి ఆయన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. న్యాయం గెలుస్తుందంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన ఎంతోకాలం సాగదని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని అన్నారు. మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమణి రమేష్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల కన్వీనర్లు చిట్టూరి అన్నవరం, కొలిశెట్టి నాగేశ్వరరావు, మట్టా వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌ను పదవి నుంచి తొలగించండి

- టీడీపీ దళిత నాయకుల డిమాండ్
- కొవ్వూరులో ఎమ్మెల్యేని చుట్టుముట్టి ఆందోళన
- 'పచ్చ' పార్టీలో మరోసారి బయటపడిన విభేదాలు



కొవ్వూరు టీడీపీ కార్యాలయం వద్ద దళిత నాయకుల ఆందోళన



వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి రోడ్డున పడ్డాయి. ఫ్లెక్సీ వివాదం నేపథ్యంలో పార్టీలోని రెండు వర్గాల్లో ఉన్న దళిత నాయకులు పరస్పర ఆరోపణలకు దిగారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని ఓ వర్గం వారు డిమాండ్ చేశారు. దీంతో వర్గపోరు రచ్చకెక్కింది. వివరాలివీ.. ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు ఆదివారం రాజమహేంద్రవరంలో మీడియా సమావేశం నిర్వహించారు. పశివేదల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఫ్లెక్సీలను కొంత మంది చించివేశారని ఆ సందర్భంగా ఆరోపణలు చేశారు. ఈ నెల 23లోగా నిందితులను గుర్తించి, అరెస్టు చేసి, చర్యలు తీసుకోవాలని, లేకుంటే 24న ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు టీడీపీ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులు సోమవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. జవహర్ ఫ్లెక్సీలు చించివేయడానికి, తమకు ఎటువంటి సంబంధమూ లేదని చెప్పారు. జవహర్ వర్గం కావాలనే టీడీపీ పరువు తీయడానికి చూస్తోందని ఆరోపించారు. అచ్చిబాబు వర్గంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఫ్లెక్సీలు చించిన వారిపై తక్షణం కేసులు పెట్టాలంటూ కొవ్వూరు పోలీస్ స్టేషన్లో జవహర్ వర్గీయులు కొందరు ఫిర్యాదు చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం, కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో దళిత నాయకులు మాట్లాడుతూ, జవహర్‌పై తీవ్ర స్థాయి ఆరోపణలు చేశారు. నియోజకవర్గం అంటేనే అచ్చిబాబు అని, ఆయనను ఏమైనా అంటే సహించేది లేదని అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని అడ్డం పెట్టుకుని పార్టీ పరువును జవహర్ బజారున పడేస్తానంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో మీడియా సమావేశం పెట్టినవారు కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన వారు కాదని, వారందరూ జవహర్ వర్గీయులేనని, కావాలనే కేసులు పెట్టి కక్ష సాధించాలని చూస్తున్నారని ఆరోపించారు. వారిని వెంటనే గుర్తించి, చర్యలు తీసుకోవాలని, వారిని వెనుక ఉండి నడిపిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జనసేన నేత టీవీ రామారావు కూటమిలో తమకు ప్రాధాన్యం లేదని, సొసైటీ పదవుల్లో అన్యాయం జరిగిందని ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా జవహర్ వర్గం మీడియా సమావేశం.. దానికి కౌంటర్‌గా కొవ్వూరు టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ దళిత నాయకులు చేసిన ఆందోళనతో కూటమి పార్టీల పరువు బజారున పడింది.

నేటి నుంచి ఆమరణ దీక్ష

- పేపరు మిల్లు కార్మికుల సమస్యలపై ఇక తాడోపేడో
- వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి రాజా వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో ఏపీ పేపరు మిల్లు యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు పరిష్కరిస్తారేమోనని వేచి చూశామన్నారు. సమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం చేస్తున్న నేపథ్యంలో మిల్లు యాజమాన్యంతో ఇక తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమని, మంగళవారం ఉదయం 9 గంటలకు ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. పేపరు మిల్లు మెయిన్ గేటు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. పేపరు మిల్లు ఎదురుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పాదాల చెంత ఆమరణ దీక్షకు కూర్చుంటానని ప్రకటించారు. దీనికి ఏపీ కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషుబాబు సంఘీభావం తెలపనున్నారని చెప్పారు. మిల్లు కార్మికులకు వేతన ఒప్పందం, ఇతర సౌకర్యాలు కల్పనలో యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అనేక రూపాల్లో ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని చెప్పారు.

కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిందని, సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికీ యాజమాన్యంతో జరుగుతున్న చర్చలు సఫలం కావడం లేదని రాజా అన్నారు. యాజమాన్యం తీరు చూస్తుంటే సమస్యను పరిష్కరించకుండా వాయిదాలు వేస్తూ కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యంతో అమీతుమీ తేల్చుకుంటామన్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన కార్మిక యూనియన్ నాయకులు తనను విమర్శించడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. గతంలో పేపర్ మిల్లులో ప్రభుత్వానికి 27 శాతం వాటా ఉండేదని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ వాటాను విక్రయించారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి షేర్లు ఉండేటప్పుడు మిల్లుపై నియంత్రణ ఉండేదని, కార్మికులకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం పరిష్కరించేదని అన్నారు. ప్రభుత్వం తన వాటా వదులుకున్న తర్వాత యాజమాన్యం ఇష్టానుసారం వ్యవహరిస్తోందని చెప్పారు. యాజమాన్యం ఇంత అన్యాయం చేస్తోందంటే గుర్తింపు యూనియన్‌గా ఎవరున్నారో ఒకసారి గుర్తు చేసుకోవాలని అన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో ఇప్పుడు జరిగినంత జాప్యం గత 30 ఏళ్లలో ఎన్నడూ జరగలేదన్నారు. తాను చేస్తున్న ఉద్యమానికి పార్టీలోని ముఖ్య నాయకులు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నందెపు శ్రీనివాస్, ఇతర నేతలందరూ మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. అవసరమైతే పేపరు మిల్లు సమస్యను రాష్ట్ర స్థాయికి తీసుకు వెళ్తామన్నారు. వాస్తవానికి ఈ నెల 9 నుంచే ఆమరణ దీక్ష చేయనున్నట్లు ప్రకటించామని, చర్చలు జరుపుతున్నామని, సమస్య పరిష్కారమవుతుందని కూటమి నాయకులు అనడం, కొద్ది రోజులు వేచి చూద్దామని కార్మిక నాయకులు చెప్పడంతో తన దీక్షను రెండు సార్లు వాయిదా వేసుకున్నానని రాజా చెప్పారు. విలేకర్ల సమావేశంలో నందెపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు బొంత శ్రీహరి, మానె దొరబాబు, మాసా రామ్‌జోగ్, బురిడి త్రిమూర్తులు, అడపా అనిల్, కోడికోట, నాళం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కాంట్రాక్టర్‌పై బిగుస్తున్న ఉచ్చు!

ఫేక్ పీఎఫ్ రశీదుల వివాదంలో కమిషనర్‌కు అన్నవరం దేవస్థానం నివేదిక

అన్నవరం: రూ.30 లక్షల ఫేక్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చలానాలు ఇచ్చి అన్నవరం దేవస్థానాన్ని మోసం చేసిన విజయవాడకు చెందిన కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ శానిటేషన్ కాంట్రాక్టర్‌పై ఉచ్చు బిగుస్తోంది. ఈ వ్యవహారంపై దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి దేవస్థానం అధికారులు సోమవారం నివేదిక సమర్పించారు. 'అన్నవరంలో శానిటరీ కాంట్రాక్టర్ మోసం' శీర్షికన ఈ నెల 17న 'సాక్షి' ప్రచురించిన వార్తకు దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి, దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వమని ఆదేశించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో మూడు రోజులుగా అన్ని వివరాలూ సేకరించిన దేవస్థానం అధికారులు సమగ్ర నివేదిక తయారు చేసి పంపించారు. మార్చి నెలలోనే తమ ఖాతాల్లో పీఎఫ్ జమ చేయకపోతే అప్పట్లోనే శానిటేషన్ సిబ్బంది కాంట్రాక్టర్‌కు ఆ విషయం తెలియజేయాలని, అయినా స్పందించకపోతే దేవస్థానానికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని, అప్పుడు దేవస్థానం అధికారులకు చర్య తీసుకునే అధికారం ఉండేదని, అలా జరగలేదు కనుక క్రిమినల్ కేసు పెట్టే వీలు లేదని న్యాయవాది చెప్పిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో జీతం తప్ప తమ ఖాతాల్లో పీఎఫ్ జమ కాలేదంటూ సిబ్బందితో దేవస్థానం అధికారులు లేఖలు రాయించి సంతకాలు తీసుకుని, ఆ విషయాన్ని కమిషనర్‌కు ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు.

కమిషనర్ నిర్ణయంపై ఉత్కంఠ

ఎటువంటి డిపాజిట్ లేకుండా, టెండర్ పిలవకుండా, నామినేషన్ పద్ధతిలో కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్‌కు నెలకు రూ.59 లక్షలు చెల్లించేలా కాంట్రాక్ట్ ఇవ్వాలని దేవస్థానం అధికారులు గత మార్చిలో పంపిన ప్రతిపాదనకు దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆమోదం తెలిపారు. ఆ సంస్థ దేవస్థానంలో గార్డెన్, గోశాల విభాగంలో 30 మంది సిబ్బందిని ఇప్పటికే సరఫరా చేస్తోంది. సాధారణంగా ప్రతి పనీ టెండర్ ద్వారానే చేయాలని కమిషనర్ గతంలో చాలాసార్లు దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఆయనను కూడా కమిషనర్ తప్పుదోవ పట్టించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు కమిషనర్ అనుమతిస్తారా లేక అధికారులపై కూడా చర్య తీసుకుంటారా అనే సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉండగా ఫేక్ చలానాల ఉదంతంలో కాకినాడలోని పీఎఫ్ కార్యాలయ అధికారులతో దేవస్థానం అధికారులు మంగళవారం సమావేశం కానున్నారు. ఫేక్ చలానాల విషయంలో పీఎఫ్ అధికారులు కూడా సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం. వారు కూడా కేసు పెట్టే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్యార్థిపై హత్యాయత్నం

ప్రేమ వ్యవహారమే కారణం

రంగంపేట: ప్రేమ వ్యవహారం ఓ ఇంజినీరింగ్ విద్యార్థిపై హత్యాయత్నానికి దారితీసింది. సినీ ఫక్కీలో కాలేజీ బస్సును ఆటోతో అటకాయించి, బస్సులోకి చొరబడిన వ్యక్తులు.. విద్యార్థిని దూషిస్తూ చాకుతో పొడిచి గాయపర్చారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై శివప్రసాద్ సోమవారం సాయంత్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి గ్రామానికి చెందిన రేలంగి సత్యసాయి శంకర్ గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. నిత్యం కళాశాల బస్సులోనే రాకపోకలు సాగిస్తుంటాడు. ఎప్పటిలాగే సోమవారం కూడా ఇంటి నుంచి కళాశాల బస్సులో బయలుదేరాడు. రంగంపేట మండలం వడిశలేరు వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరానికి చెందిన మణి, సాయి అనే ఇద్దరు వ్యక్తులు ఆటోతో బస్సును అటకాయించి, లోనికి చొరబడ్డారు. సత్యసాయి శంకర్ దవడపై సాయి కొట్టగా, మణి అసభ్య పదజాలంతో దూషించాడు. అమ్మాయితో మాట్లాడవద్దని ఎన్నిసార్లు చెప్పినా వినవా అంటూ మణి తన వెంట తెచ్చిన చాకుతో సత్యసాయి శంకర్ ఎడమ ఛాతి కింద పొడిచాడు. అనంతరం ఇద్దరూ ఆటోలో అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సత్యసాయి శంకర్‌ను అతడి స్నేహితులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

మంచినీరు అడిగి.. మంగళ సూత్రం కాజేశాడు

మామిడికుదురు: మహిళను మంచి నీళ్లు అడిగి.. ఆమె మెడలో బంగారు మంగళసూత్రాల తాడును దుండగుడు అపహరించిన సంఘటన పాశర్లపూడి బాడవలో ఆదివారం రాత్రి కలకలం రేపింది. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాశర్లపూడి బాడవకు చెందిన వలవల వరలక్ష్మి ఇంటికి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైక్‌పై వచ్చాడు. అంతకుముందే ఆమె భర్త ఏదో పనిపై బయటకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ఆమె వద్దకు వచ్చిన అపరిచిత వ్యక్తి ఎవరిదో చిరునామా కావాలని అడిగాడు. ఆమె దారి చెప్పిన తర్వాత.. దాహంగా ఉందని మంచినీళ్లు అడిగాడు. నీళ్లు తాగాక ఒకసారి సెల్‌ఫోన్ ఇవ్వమని అడిగితే, అందుకామె నిరాకరించింది. దీంతో అతడు హఠాత్తుగా ఆమె గొంతు పట్టుకోగా, ఆమె అరిచేందుకు యత్నించింది. అరిస్తే చంపుతానని బెదిరించి, ఆమె నోరు నొక్కి, మెడలోని రెండున్నర కాసుల బంగారు మంగళసూత్రాల తాడు తెంచుకుని బైక్‌పై పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నవోదయం ఏదీ..?

- జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు గణనీయంగా తగ్గిన దరఖాస్తులు
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తి అంతంతమాత్రం
- ఈ నెల 29తో ముగుస్తున్న గడువు
- గతేడాది వచ్చినవి 8,971
- ఈ ఏడాది ఇంత వరకు 668 మాత్రమే..
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష



రాయవరం: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి కృషి చేస్తోంది. ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టం కట్టి, వారికి ఉజ్వల భవిష్యత్తునిచ్చే ఆలయంగా నవోదయ విద్యాలయం భాసిల్లుతోంది. అటువంటి నవోదయ విద్యాలయంలో సీటు వస్తే తమ పిల్ల భవిష్యత్తుకు ఢోకా ఉండదని తల్లిదండ్రులు ఆశ పడుతుంటారు. అందుకే తమ పిల్లల్ని చేర్చేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. కారణాలేమైనా ఈ ఏడాది దరఖాస్తుల ప్రక్రియ మందగించడంతో.. గతంతో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. నవోదయలో ఆరో తరగతిలో చేరాలంటే ప్రవేశ పరీక్షే ఆధారం. ఇందులో ప్రతిభ చూపితే సీటు ఖాయం. 2026–27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించారు. ఐదో తరగతిలో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేయాల్సి ఉండగా, ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య నిరాశాజనకంగా ఉంది. ఈ నెల 29తో దరఖాస్తుల గడువూ ముగియనుంది. కాకినాడ జిల్లాలో పెద్దాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని విద్యార్థులు మాత్రమే ఇక్కడ దరఖాస్తు చేయాలి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు. విద్యతో పాటు, అధునాతన వసతుల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం ఈ విద్యా సంస్థల్లో ప్రత్యేకత.

జిల్లాల వారీగా దరఖాస్తులు ఇలా..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు (గతేడాది)	నేటి వరకు దరఖాస్తులు (ఈ ఏడాది)
కోనసీమ	3,869	201
తూర్పు గోదావరి	1,741	107
కాకినాడ	3,361	360

అవగాహన లేక..?

ఈ ఏడాది డిసెంబర్ 13న నిర్వహించే ప్రవేశ పరీక్షకు మూడు జిల్లాల నుంచి కేవలం 668 దరఖాస్తు మాత్రమే వచ్చాయి. ఉమ్మడి జిల్లా నుంచి అతి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. 2023–24లో 8,506 దరఖాస్తులు రాగా, గతేడాది మూడు జిల్లాల పరిధిలో 8,971 దరఖాస్తులు వచ్చాయి. ఇలాఉంటే, ఈ ఏడాది 9 వేల వరకు దరఖాస్తులు వస్తాయనే అంచనాతో అధికారులు ఉన్నారు. గడువు సమీపిస్తున్నా తక్కువగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య చూసి అధికారులు విస్తుపోతున్నారు. దీనికి కారణం.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించక పోవడమా, లేక వారిలో ఆసక్తి సన్నగిల్లడమా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు వచ్చినా, రాకున్నా విద్యార్థులతో దరఖాస్తు చేయిస్తే, ఐదో తరగతిలోనే విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవాటు చేయడం, ఆన్‌లైన్ పరీక్షను పరిచయం చేసినట్టవుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. జవహర్ నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. మూడు జిల్లాల్లో ఈ ఏడాది ఐదో తరగతిలో సుమారు 60 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2026–27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2014 మే ఒకటో తేదీ నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3, 4 తరగతుల్లో ఉత్తీర్ణత సాధించి, ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు. గతేడాది ప్రవేశ పరీక్షకు హాజరైన వారు అనర్హులు.



పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయ

పరీక్షా విధానమిలా..

నవోదయ ప్రవేశ పరీక్షను ఈ ఏడాది డిసెంబర్ 13న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జిల్లాలో నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షను విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న భాషను(తెలుగు/ఇంగ్లిష్) ఎంచుకుని పరీక్ష రాయవచ్చు. ప్రవేశ పరీక్షలో 80 ప్రశ్నలుంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసేందుకు రెండు గంటల సమయాన్ని కేటాయిస్తారు. మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధా శక్తి(మెంటల్ ఎబిలిటీ)పై 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితం(అర్థమెటిక్), భాషపై ఒక్కొక్క విభాగానికి 20 వంతున 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. తప్పుడు సమాధానాలకు నెగిటివ్ మార్కులు ఉండవు. దివ్యాంగులకు 40 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షా పత్రాల రూపకల్పన నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై, ప్రవేశానికి ఎంపికైన వారికి తొలి రెండేళ్లు తెలుగు/ఇంగ్లిష్ భాషల్లో బోధిస్తారు.

పోటీ పరీక్షలపై అవగాహన

జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో సీటు పొందడాన్ని ప్రతిష్టగా భావిస్తారు. ఇందుకు ఏటా దరఖాస్తు చేసిన విద్యార్థులు ప్రత్యేకంగా తర్ఫీదు పొందుతారు. జిల్లాలో ఉన్న ఐదో తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా ఐదో తరగతి నుంచే పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆలోచన చేసి, అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతి విద్యార్థితో దరఖాస్తు చేయించాలి



విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థితో దరఖాస్తు చేసేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు ప్రతి విద్యార్థి దరఖాస్తు చేయడం ప్రధానమైన విషయంగా భావించాలి. ఈ నెల 29వ తేదీ దరఖాస్తుకు తుది గడువు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులను మూడు జిల్లాల విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలలకు పంపించాం. పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం.

– బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి, పెద్దాపురం

డీఈవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



జవహర్ నవోదయలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక శాతం సీట్లు కేటాయించడంతో వారికి ప్రయోజనం కలుగుతుంది. జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారుల ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ప్రవేశ పరీక్షను విద్యార్థులతో రాయించడం వల్ల వారిలో పోటీ పరీక్షలను ఎదుర్కొగలిగే ఆత్మ విశ్వాసం ఏర్పడుతుంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

అరెస్టును ఖండిస్తూ మోకాళ్లపై నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థి విభాగం నాయకులు

అమలాపురం రూరల్: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం జనుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఆరోపణలు తప్ప, ఆధారాల్లేకుండా కూటమి ప్రభుత్వం మిథున్‌రెడ్డిపై కేసులు పెట్టిందని రమేష్ ఆరోపించారు. విద్యార్థి విభాగం నాయకులు పెయ్యాల సాయి, బడుగు మోహన్, వరసల సుజిత్, విన్సీ, సాగర్, ఆనంద్, రవికుమార్, సల్మాన్‌రాజ్ పాల్గొన్నారు.

‘మా ఆకలి కేకలు పట్టవా?’

- సీఎం, డిప్యూటీ సీఎంపై కార్మికుల మండిపాటు
- కళ్లకు గంతలతో సత్యసాయి డ్రింకింగ్ ప్రాజెక్టు సిబ్బంది నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సుపరిపాలన తొలి అడుగు అంటూ.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు చేపట్టామని గొప్పలు చెబుతున్న సీఎం, డిప్యూటీ సీఎంకు తమ ఆకలి కేకలు పట్టవా అని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలాచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వాటర్ ప్రాజెక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టి, కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీను, ఇసాక్ మాట్లాడుతూ, 19 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో.. కుటుంబ పోషణ కష్టమై సమ్మె బాట పట్టామన్నారు. 25 నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ కట్టడం లేదని ఆరోపించారు. సుపరిపాలన అని చెప్పుకుంటూ తిరిగే నేతలకు తమ ఆకలి బాధ అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఈ సమ్మె కారణంగా సుమారు 85 గ్రామాల్లో దాదాపు మూడు లక్షల మంది మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తమ వేతనాల విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో సమ్మె చేపట్టగా.. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చినప్పటికీ, అది ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం 52 మంది కార్మికుల కుటుంబాల ఆకలికేకలను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కె.రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు అద్దం పడుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మిథున్‌రెడ్డి అరెస్ట్ కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అణచివేత ధోరణులను వైఎస్సార్ సీపీ ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగడుతుందని, దానిని ఓర్వలేకే తమ పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజా క్షేత్రం నుంచి జైళ్లలో వేయడం ద్వారా కూటమి నేతలు తమ ప్రభుత్వాన్ని రక్షించుకోవాలని చూస్తున్నారని, వాస్తవానికి ఏ ఒక్క వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్త అణచివేతలకు భయపడరన్నారు. లిక్కర్ స్కాంలో తొలుత రూ.50 వేల కోట్ల అవినీతి జరిగిందని, అయితే సిట్ రిపోర్టులో కేవలం రూ.3,500 కోట్లుగా చూపించడం ప్రభుత్వ అసంబద్ధ వైఖరికి నిదర్శనమన్నారు. మిథున్‌రెడ్డిపై ఆరోపణలు ఏమాత్రం నిలబడవన్నది వాస్తవమన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను బయట పెట్టాలన్నారు. సమావేశంలో పార్టీ మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, దూలం వెంకన్నబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కక్ష సాధింపుతోనే మిథున్‌రెడ్డి అరెస్ట్

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురం టౌన్: రెడ్ బుక్ రాజ్యాంగం, కక్ష సాధింపుతోనే కూటమి ప్రభుత్వం ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేసిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. అమలాపురం హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా, కేవలం వైఎస్సార్ సీపీ నేతలపై ఎలా తప్పుడు కేసులు పెట్టి, జైల్లో పెడదామనే దుర్మార్గపు ఆలోచనలతోనే పాలన చేస్తున్నారని మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థ కూడా ఇలాంటి అక్రమ కేసుల కోసమే సమయాన్ని పూర్తిగా కేటాయించి, లా అండ్ ఆర్డర్ కోసం పనిచేయడం లేదని విమర్శించారు. అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలపై కోర్టులు అక్షింతలు వేస్తున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ధ్వజమెత్తారు. ఎంపీగా, పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్‌గా మిథున్‌రెడ్డి పోలీసు దర్యాప్తునకు సహకరిస్తున్నా, సాక్ష్యాలను తారుమారు చేసి అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమని ఖండించారు. కుట్రలకు, అక్రమ కేసులకు తెరవెనుక సూత్రధారులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, అతని పుత్రుడు, మంత్రి లోకేష్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

కొత్తపేట: దైవ దర్శనానికి వచ్చి గోదావరిలో ప్రమాదవశాత్తు గల్లంతైన బీటెక్ విద్యార్థి పంతంగి దినేష్ (22) మృతదేహం సోమవారం ముక్తేశ్వరం సమీపంలో లభ్యమైంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం మెర్లపాడు గ్రామానికి చెందిన దినేష్ తన స్నేహితులతో కలిసి శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చాడు. ఆలయ సమీపాన గోదావరిలో స్నానం చేస్తూ గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రెండు స్పీడ్ బోట్లపై గాలించాయి. మూడు రోజుల పాటు గాలించగా, ముక్తేశ్వరం–శానపల్లి లంక మధ్య గోదావరిలో దినేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

లోయెస్ట్ టెండర్ రూ.31 వేలు

- అన్నవరం సత్రాల్లో దుప్పట్లు ఉతికేందుకు..
- వాషింగ్ మెషీన్ల ద్వారా రూ.26 వేలు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: దేవస్థానం సత్రాల్లో దుప్పట్లు, డోర్ కర్టెన్లు, ఇతర వస్త్రాలు నామినేషన్ పద్ధతిలో నెలకు రూ.60 వేలకు ఉతికిస్తుండగా, దానిపై జూన్ 24న ‘సాక్షి’లో ‘సత్యదేవునికే టెండర్’ శీర్షికన కథనం వెలువడింది. దీంతో దేవస్థానం టెండర్ పిలిచింది. నెలకు రూ.31 వేలకే వాటిని ఉతకడానికి లోయెస్ట్ టెండర్ దాఖలైంది. వాషింగ్ మెషీన్ల ద్వారా నెలకు రూ.26 వేలకే ఉతకడానికి లోయెస్ట్ టెండర్ వచ్చింది. గతంలో చెత్త ట్రాక్టర్ నిర్వహణ విషయంలో కూడా ఇలాగే ‘సాక్షి’ కథనంతో టెండర్ పిలవగా, దేవస్థానానికి డబ్బు ఆదా అయిన విషయం తెలిసిందే. తాజా కథనంతో మరోసారి దేవస్థానానికి డబ్బు ఆదా అయినట్టయింది. వివరాల్లోకి వెళితే..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్రాల గదుల్లో ఉపయోగించే దుప్పట్లు, గలేబీలు, డోర్ కర్టెన్లు, రగ్గులను ఈ ఏడాది ఫిబ్రవరి వరకు దేవస్థానంలో శానిటరీ కాంట్రాక్ట్ నిర్వహించిన హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ ఉతికించేది. మార్చి ఒకటో తేదీ తర్వాత శానిటరీ నిర్వహణను నామినేషన్ పద్ధతిపై విజయవాడకు చెందిన కనకదుర్గా మేన్‌పవర్ సర్వీసెస్‌కు అప్పగించారు. దుప్పట్లు ఉతికి అప్పగించడం, చెత్త ట్రాక్టర్ నిర్వహణ కూడా నామినేషన్‌పై కేటాయించారు. ఇందులో మార్చి నుంచి సత్రాల్లో దుప్పట్లు, గలేబీలు, ఇతర వస్త్రాలు ఉతికేందుకు నామినేషన్‌పై నెలకు రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు నామినేషన్‌పై కేటాయించారన్న విమర్శలున్నాయి. అవి ఉతికేందుకు మెటీరియల్‌నూ దేవస్థానమే అందజేస్తోంది. దీనిపై టెండర్లు పిలిస్తే ఇంకా తక్కువకు ఉతుకుతారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిపై గత నెల 23న స్థానిక రజక వృత్తిదారుడు కింతాడ శ్రీనివాసరావు తాము నెలకు రూ.45 వేలకే ఉతుకుతామని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంపై ‘సాక్షి’లో ‘సత్యదేవునికే టెండర్’ శీర్షికన కథనం ప్రచురితమైంది. నామినేషన్‌పై వస్త్రాలు ఉతికించడం వల్ల దేవస్థానానికి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని, టెండర్ పిలిస్తే అంతకన్నా తక్కువకు కొటేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందనేది సారాంశం. దీనిపై స్పందించిన దేవస్థానం అధికారులు.. దుప్పట్లు ఉతికేందుకు ఈ నెల 14న టెండర్లు పిలిచారు. వాషింగ్ మెషీన్లు, లిక్విడ్ డిటర్జెంట్‌ను దేవస్థానం సరఫరా చేసే పద్ధతి, దేవస్థానం కేవలం ఉతికేందుకు లిక్విడ్ సరఫరా చేస్తే మేన్‌పవర్ ద్వారా ఉతికి.. ఇస్త్రీ చేసి ఇచ్చేందుకు మరో పద్ధతిన వేర్వేరుగా టెండర్లు కోరారు. దీనికి సోమవారం గడువుగా నిర్ణయించారు. ముగ్గురు దాఖలు చేసిన కొటేషన్లను సోమవారం పరిశీలించగా, దేవస్థానం వాషింగ్ మెషీన్లు, లిక్విడ్ సరఫరా చేస్తే ఉతికి ఇచ్చేందుకు నెలకు రూ.26 వేలు, కేవలం లిక్విడ్ మాత్రమే సరఫరా చేస్తే మేన్ పవర్ ద్వారా ఉతికి ఇచ్చేందుకు రూ.31 వేలకు లోయెస్ట్ కొటేషన్ దాఖలయ్యాయి. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ ఐవీ రోహిత్‌తో త్వరలో జరిగే పాలకవర్గ సమావేశంలో వీటిని ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.



జూన్ 24న ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనం

చెత్త ట్రాక్టర్ నిర్వహణలోనూ..

నామినేషన్‌పై చెత్త ట్రాక్టర్ నిర్వహణను నెలకు రూ.60 వేలకు అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టగా.. దానిపైనా ‘సాక్షి’లో మార్చి 28న ‘రత్నగిరిపై చెత్త వివాదం’ శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పట్లో విధిలేని పరిస్థితుల్లో టెండర్ పిలవగా, నెలకు రూ.36,100కు లోయెస్ట్ టెండర్ దాఖలైంది. తద్వారా దేవస్థానానికి ఏటా రూ.4,32,120 ఆదా అయింది.